# న్యాయానికి నిర్వచనం లేదు

రచన:
''మారుతి''

''హల్లో ఆనంద్!''

మాసిన గడ్డంతో, రేగినజుట్టుతో, అక్కడక్కడా చినిగిన దుస్తులలో వున్న వ్యక్తి ఆ పిలుపువిని, లోతుకు పీక్కుపోయిన కళ్ళలోకి ఏదో జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నట్టు ''మీరు...మీరు...'' అని మాత్రం అనగలిగాడు.

'అప్పుడే మరిచిపోయావురా! నేనురా, రవిని'.

'రవీ!' ఆనంద్ కళ్ళు ఆనందంలో మెరిసినయ్. అమాంతం అతడు తన మిత్రుణ్ణి వాటేసుకున్నాడు.

పదేళ్ళ అనంతరం సెంట్రల్ స్టేషన్ ప్లాట్ ఫారం మీద కలుసుకున్న ఆ మిత్రులిద్దరూ గాఢమైత్రితో అలా కౌగిలించుకోవడాన్ని వింతగా చూశారు కొందరు ప్రయాణీకులు.

'ఎప్పుడొచ్చావేమి మద్రాసుకి?' ప్రశించాడు రవి.

'ఇప్పుడే జనతాలో వచ్చాను బెజవాడనుంచి మరి మీరో?'

'నేనిక్కడే వుంటున్నానులే. ఫ్రెండుకి సెండాఫ్ ఇవ్వడానికి వచ్చాను. సరేగాని 'మీరు-మీరు' అంటూ క్రొత్తగా ఏదో మర్యాదలు ఒలకబోస్తున్నావేమిటి?' నవ్వుతూ అడిగాడు రవి.

'ఏమో రవీ, నిన్ను...అదే-నీలోని హుందాతనాన్ని చూస్తూంటే అలా సంబోధించాలనిపించింది.'

'పిచ్చివాడా! పదేళ్ళపాటు ఎడబాసి వున్నంత మాత్రాన మనలో మనకేమిటోయ్ ఈ మర్యాదలు. మనం ఎప్పుడూ చనువుగా మెలగాల్సిన స్నేహితులమే. పద అలా బుహారీకి వెళ్ళి టీ తీసుకుందాం' ఆప్యాయంగా ఆనంద్ భుజాలమీద చేతులు వేస్తూ అన్నాడు రవి.

మిత్రులిద్దరూ బుహారీ హోటల్లో రూఫ్ గార్డెన్ లో కూర్చున్నారు.

బ్రెడ్, ఆమ్లెట్లూ ఆర్డరిచ్చాడు రవి.

'ఆనంద్! నీకు జ్ఞాపకముందా? విశాఖపట్నంలో వుంటున్నప్పుడు రోజా, నువ్వూ, నేనూ - అరుణా కలిసి స్కూలుకు వెళ్ళే వాళ్ళం. ఎంత చలాకీగా వుండేది అరుణా! ఎప్పుడూ నవ్వుతూ, చిలిపిగా ఏ జోకబుల్లు చెబుతూ మనల్ని ఎంతగా నవ్వించేది. ఎంత అమాయకంగా వుండేది అరుణ. ఆనంద్! నేను అప్పుడప్పుడూ అనుకునే వాణ్ణి - ఇంత అమాయకంగా, పసిపాప హృదయంలా తెల్లనివన్నీ పాలు అని నమ్మే అరుణ పెద్దయితే - ఈ ప్రపంచంలో ఎలా జీవిస్తూందా అని. ఈ విషయం మీదే నేనూ అరుణా తరచూ వాదించుకునే వాళ్ళం కూడా - 'మానవులందరూ స్వతహాగా మంచి వాళ్ళే రవీ! ఒక్కొక్కప్పుడు అనుకోని పరిస్థితులూ, పరిసరాలూ వారిలో హర్షించదగని మార్పును కలిగిస్తయ్యి. వాళ్ళసహజ స్వభావాలు మారిపోతవి. అలా మారడానికి నిజంగా వాళ్ళే బాధ్యులంటావా? కాదు. వ్యక్తి సహజ ప్రకృతినే మార్చగలిగిన ఆ పరిస్థితులే అందుకు కారణం. 'పరిస్థితులకు బానిస మానవుడు' అనేది అరుణ అన్నీ తెలిసిన పెద్దలా!

'ఎన్ని చెప్పినా ప్రతివ్యక్తినీ గ్రుడ్డిగా నమ్మడం అంత మంచిది కాదు అరుణా, మెరిసేదంతా బంగారం అనే భ్రమలోవున్నావు నువ్వు' అనేవాణ్ణి ఆమె అభిప్రాయాన్ని ఎలాగైనా మార్చాలనే వుద్దేశ్యంతో.

నిండుగా నవ్వి అనేది అరుణ—'నిజంగా అంతేరవి! తాత్త్వికులు చెప్పినట్లు మనమంతా ఏదో ఒక భ్రాంతిలోనే బ్రతుకున్నాము. భయస్థుడు తన నీడను చూసి దయ్యమనుకుంటాడు. పిరికివాడు చీకటిలో తాడును పాము అనుకొని గావు కేకపెడతాడు. ఇదంతా నిజంగా భ్రమే. వ్యక్తి మంచి చెడ్డలు మనం అతణ్ణి చూచే దృక్పథంమీద కూడా ఆధారపడివుంటుంది. దుమ్ముచేరిన అద్దాల్లోంచి చూచే వస్తువులన్నీ కూడా దుమ్ములో వున్నట్లే కనిపించడం సహజం, అంటూ తన వాదాన్నే మరింతబలపరిచేది. ఇహ నేనేమని వాదించగలను? అరుణతో అలా తర్కిస్తూ కూర్చుంటే గంటలు నిముషాల్లా దొర్లిపోయేవి, ఎంత కాలమైందా అరుణను చూసి' స్వగతంతా చెప్పి ముగించేడు రవి. ఆనంద్ ఆమ్లెటు తినడం పూర్తిచేసి తలవంచుకుని ప్లేటుమీద వ్రేళ్ళలో గీతలుగీస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు.

బాయ్ ని పిచి రెండు కప్పులు టీ తెప్పించాడు రవి.

'ఆనంద్! అరుణ ఇప్పుడెలా వుంది? బాగా ఎదిగి

వుంటుందికదూ! వివాహంకూడా అయ్యేంటుంది. అరుణ వివాహాన్ని చూసే అదృష్టంలేకపోయిందిరా నాకు.

'చెప్పు ఆనంద్! అరుణకు మంచి సంబంధమే చేశావా? పెళ్ళి బాగా జరిగిందా?' గత దినాల జ్ఞాపకాలు క్రమ్ముకోగా ఆనందంలో, ఆవేశంలో, అవ్యక్తమైన ఏదో బాధతో అడిగాడు రవి.

చిన్నగా నవ్వాడు ఆనంద్. ఆ నవ్వు వెనుక దాగిన విషాదం రవికి అర్థంకాలేదు.

'జరిగింది రవీ! అరుణ అంతిమ యాత్ర బాగానే జరిగింది. రెండు నెలల క్రితమే ఆమె అంత్యక్రియలు బెజవాడలో ఘనంగా నే జరిపించాను' కన్నీళ్ళనుఆపుకోడానికి ప్రయత్నిస్తూ రుద్ధకంఠంతో అన్నాడు ఆనంద్.

'ఆనంద్!!' నిర్విణ్ణుడై అయోమయంగా అన్నాడు రవి.

'అవును రవీ! అరుణ చచ్చిపోయింది. నా చెల్లెలు ఆత్మహత్య చేసుకుంది.'

'అరుణ ఎందుకు చచ్చిపోయింది? అసలేం జరిగింది?'

'ఏం జరుగుతుంది? తరతరాలుగా అమాయకులైన స్త్రీ జాతికి ఏం జరుగుతూ వుందో నా చెల్లెలికీ అదే జరిగింది. ఎవడినో నమ్మి మోసపోయింది. తన వ్యక్తిత్వానికీ, తను దృఢంగా నమ్మిన అభిప్రాయాలకూ, ఆశయాలకూ పెద్ద దెబ్బ తగలడంలో తట్టుకోలేక చచ్చిపోయింది.'

'అరుణను అన్యాయం చేసిందెవరు? అతడ్నిగురించి అరుణ నీతో ఏమైనా చెప్పిందా?' ఆవేశంతో అడిగాడు రవి.

'లేదు. నే నెంతగానో అడిగాను, బ్రతిమాలాను. కాని చివరివరకు అరుణ తనను వంచించిన ఆ కిరాతకుడి పేరు చెప్పడానికి నిరాకరించింది. చనిపోయే ముందు నా కొక వుత్తరం మాత్రం రాసి పెట్టిపోయింది' అని పర్సులోంచి మడిచి పెట్టిన వుత్తరంతీసి రవిచేతికిచ్చాడు ఆనంద్.

ఆతృతతో వుత్తరం చదివాడు రవి—

అన్నయ్యా!

వాంఛలోపడి, సుఖాన్ని కాంక్షించి చేసిన పనిలో నాకూ అతడికీ సమానమైన బాధ్యతేవుంది. నేను అతని చేత వంచించబడ్డానని భావించటం లేదు. నేనుఏనాడో చేసిన పాపఫలమే ఈరీతిగా పరిణమించింది. అందుకు అతడ్ని నిందించి ప్రయోజనమేమిటి? జీవితంలో కాలు జారిన నేను ఇంకా బ్రతికి నీకు తలవంపులు తేవడం నా కిష్టంలేదు. అందుకే శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను నీ చెల్లిని క్షమిస్తావుకదూ!

—అరుణ.

'రవీ! నా చెల్లెలి చావుకు కారణమైన ఆ ఘాతకుడు ఎవరో తెలుసుకోవాలని అరుణ పెట్టెలన్నీ గాలించాను. నాలో పగ ప్రజ్వరిల్లింది, ప్రతీకార వాంఛ నన్ను దహించివేసింది. చివరకు అరుణ పుస్తకాల పెట్టెలో ఆ వంచకుడి ఫోటో దొరికింది' అని పర్సులోంచి ఓ చిన్న పాస్ పోర్ట్ సైజు ఫోటోతీసి రవికి చూపించాడు.

అందమైన ఒక యువకుని ఫోటో అది. వెనుకవైపు అరుణకు ముద్దులతో-మధు' అని వ్రాసి వుంది.

ఆ ఫోటో చూస్తూన్నంత సేపూ రవిలో కలిగిన సంచలనాన్ని గుర్తించలేకపోయాడు ఆనంద్. ఆవేశంలో చెప్పడం ప్రారంభించాడు-

'రవీ! మాటలలో మధువును చిలికించి హృదయంలో విషాన్ని దాచుకున్నాడు ఈ దుర్మార్గుడు. వీడికోసం బెజవాడ నగరమంతా గాలించాను. ఒక రోజు రాత్రి పదిగంటల ప్రాంతంలో కృష్ణ ఒడ్డున ఒక యువతితో ప్రణయకలాపం జరుపుతూ నాకంటపడ్డాడు. తనకు సర్వస్వం అర్పించుకున్న స్త్రీ ఆత్మహత్య చేసుకుని వారం రోజులైనా కాలేదు. అప్పుడే మరో యువతితో ప్రేమకలాపం! మానవత్వం లేని పశువు! పగతీర్చుకోవాలనే వాంఛ నాలో అధికమైంది. విచక్షణాజ్ఞానం నశించింది నాలో. ఆ రాత్రే వాడి అంతం చూడాలని తీర్మానించుకున్నాను, అర్ధగంట తరువాత ఆయువతి కారులో వెళ్ళిపోయింది. అరుణ మరణానికి కారభూతుడైన ఆ వంచకుడు, ఇసుకలో భారంగా అడుగులేసుకుంటూ మెల్లగా నడుస్తున్నాడు. పొంచివున్న నేను వెనుకనుంచి బలంగా వాడి గొంతుపట్టుకున్నాను. పిచ్చి ఆవేశంలో నా రెండు చేతులతో బలంగా వాడిగొంతు పిసికాను. అరుణలాగే వూపిరాడకుండా, గిలగిల తన్నుకునిచచ్చాడు. నాపగ చల్లారింది. వాడిశవాన్ని కృష్ణలోనికి తోశాను. వాడు ప్రాణంతో వుంటే అరుణలాంటి ఎందరు స్త్రీలు వాడి మోసానికి బలైపోయేవారో? అందుకే వాణ్ణి

చంపేశాను. ఇప్పుడు చెప్పు రవీ! నేను నేరం చేశానో? నేను హంతకుణ్నా? కాదు. ఒక అబలను వంచించి, ఆమె చావుకు కారణమైన ఒక హంతకునికి తగినశాస్తి చేశాను. అంతే! నేను నేరం చేయలేదు. భగవంతుని దృష్టిలో కూడా నేను నేరస్థుణ్ణి కాను. అందుకే నేమో నన్నెవరూ శిక్షించలేదు. ఇంతవరకూ ఎవరికీ నామీద చిన్న అనుమానంకూడా కలుగలేదు. కాని రవీ! చట్ట రీత్యా నేను నేరస్థుణ్ణే కావచ్చు. అయినా ధర్మం - న్యాయం, వీటిదృష్టిలో నేను చేసింది, నేరం కాదని ఎవరైనా చెప్పగలిగితే నాకే శిక్షపడినా నవ్వుతూ అనుభవించడానికి సిద్ధంగావున్నాను. నా బాల్యస్నేహితుడివి. నన్ను గురించి అన్నీ తెలిసినవాడివి నువ్వు. రవీ! నేను హత్య చేశానా? హంతకుణ్నా నేను?' ఆవేశంలో రవి రెండు చేతులూ పట్టుకుని అడిగాడు ఆనంద్.

కొన్ని క్షణాలవరకు ఏమీ సమాధానం చెప్పలేదు రవి. తరువాత ఒక నిశ్చయానికి వచ్చినవానిలా లేదు ఆనంద్, నువ్వు నేరంచేయలేదు, అని భారంగా నిట్టూర్చాడు. వెంటనే ఏదో చటుక్కున జ్ఞాపకానికి వచ్చినట్లు, 'ఆనంద్ ! మరిచేపోయాను. నాకొక అర్జంటు పనివుంది. అన్నట్లు నీ రూం అడ్రస్ చెప్పు. రేపు పొద్దున్నే వచ్చి నిన్ను కలుసుకుంటాను' అన్నాడు. వాచ్ చూసుకుంటూ.

'రూం నెంబరు పన్నెండు' అడ్రస్ ఇచ్చాడు ఆనంద్.

'రేపెక్కడికీ వెళ్ళవుగా. నే వచ్చే వేళకి రూంలో నే వుంటావు కదూ!'

'ఎక్కడికీ పోను. రేపంతా పూర్తిగా విశ్రాంతి తీసుకో దలచాను. తప్పకుండా రావాలి మరి'.

'సరే! మరి నే వెళ్ళనా. గుడ్‌నైట్' బిల్లుచెల్లించి త్వర త్వరగా బయటికి నడిచాడు రవి.

× × ×

మరుసటిరోజు లాడ్జి ముందు పోలీసు వేన్ నిలిచి వుంది. గది తలుపులు తట్టిన చప్పుడు కావడంలో అప్పుడే నిద్ర లేచిన ఆనంద్ తలుపులు తెరిచాడు. ఇన్‌స్పెక్టరు దుస్తులలోవున్న మిత్రుణ్ని చూడగానే నిర్ఘాంత పోయాడు.

'రవీ! నువ్వా!' అని మాత్రం అనగలిగాడు.

'అవును ఆనంద్ నేనే. నిన్నటివరకూ నీ ప్రాణ స్నేహితుణ్ని. ఈ క్షణంలో నిన్ను అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసు వుద్యోగిని' ఎంతో గంభీరంగా పలికిన అతని మాటల్లో మిత్రుణ్ని అరెస్టు చేస్తున్నాననే బాధ ధ్వనించకపోలేదు.

'రవీ! మరి నిన్న నేను నేరస్తుణ్ని కాదని అన్నావే!' అయోమయంగా తనలో తను అనుకుంటున్నట్లుగా అన్నాడు ఆనంద్.

'అది వ్యక్తిగా నేను వెలిబుచ్చిన అభిప్రాయం మాత్రమే.'

'నేను హత్యచేసినట్లు నీకు ముందే తెలుసా?' అడిగాడు ఆనంద్ మిత్రుని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

'లేదు. నిన్న హోటల్లో నువ్వు స్వయంగా నాకు చెప్పేవరకూ నాకా విషయమే తెలీదు. రెండు నెలల క్రితం కృష్ణానదిలో ఒక యువకుని శవం తేలింది. శవ పరీక్షవల్ల ఆ యువకుడు గొంతునులిమి చంపబడ్డాడని బుజువైంది. ఆ యువకుని ఇతర విషయాలేవీ బెజవాడ పోలీసులు తెలుసుకోలేక పోయారు. చనిపోయిన ఆ యువకుని దూరపు బంధువు లెవరో మద్రాసులో వుంటున్నట్లు మాత్రం మాచాయగా తెలిసింది. వారం రోజుల క్రితమే శవం ఫోటో మా బ్రాంచికి పంప బడింది. ఆ యువకుని హత్యా విషయమై పరిశోధన చేయడానికి నేను నియమించబడ్డాను. నిన్న నువ్వు చూపించిన ఫోటో చూడగానే నాకు అంతా అర్థమైంది. నేనిప్పుడు అరెస్టు చేయకతప్పను ఆనంద్!' అని పోలీసుల వేపుతిరిగిగాడు రవి.

అతని వెంటవున్న పోలీసులు ఆనంద్ చేతులకు సంకెళ్ళు తగిలించారు.

'అన్యాయంగా ఒక యువకుణ్ని హత్యచేశానా? నేను చేసింది న్యాయంకాదా?' పిచ్చివానిలా అరిచాడు ఆనంద్.

విషాదంగా నవ్వి అన్నాడు రవి — 'న్యాయాన్యాయాలను నిర్ణయించే అధికారం మనకు లేదు. అసలు న్యాయానికి అర్థం ఏమిటో ఎవరు చెప్పగలరు?' భారంగా అడుగులు వేస్తూ పోలీసులవెంట నడిచాడు ఆనంద్.